

సికింద్లాపూర్‌లో ప్రత్యేక పూజలు

శివ్వంపేట, న్యూస్‌టుడే: శివ్వంపేట మండలం సికింద్లాపూర్‌లో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కోనేరులో పుణ్య స్నానాలు ఆచరించారు. తలనీలాలు, ఒడి బియ్యం సమర్పించి మొక్కులు చెల్లించారు.

వనదుర్గమ్మకు సహస్రనామార్చన

పాపన్నపేట, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గామాత ఆలయం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తెల్లవారు జామున 5గంటలకు అర్చకులు అమ్మవారికి అభిషేకం చేపట్టి సహస్రనామార్చన, కుంకుమార్చన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. మంజీరా నదిపాయల్లో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం మాతను దర్శించుకున్నారు. పలువురు బోనాలు, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు.



ఆలయ పరిసరాల్లో భక్తులు

సమస్యల వసతిగృహాలు

మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులకు ఇబ్బందులు

పేద, మధ్యతరగతి విద్యార్థుల ప్రయోజనం కోసం ఏర్పాటు చేసిన సంక్షేమ వసతిగృహాలు పలు రకాల సమస్యలకు నిలయంగా మారాయి. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతిగృహాల్లో ఏదో ఒక సమస్య దర్శనమిస్తోంది. ధ్వంసమైన కిటికీలు, శుద్ధిచేయని తాగునీరు, అపరిశుభ్ర శౌచాలయాలు, సదుపాయాలు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీటిని మరమ్మతులు చేయించాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఈ సమస్యలపై 'న్యూస్‌టుడే' పరిశీలనాత్మక కథనం..

- న్యూస్‌టుడే, మెదక్ టౌన్, నర్సాపూర్, చేగుంట, రామాయంపేట, తూప్రాన్, వెల్దుర్తి, శివ్వంపేట, పెద్దశంకరంపేట



మెదక్ వసతిగృహంలో కిటికీలు ధ్వంసంకావడంతో దుప్పట్లు అడ్డుగా..

న్యూస్‌టుడే ప్రత్యేక పరిశీలన

● మెదక్ పట్టణంలోని సమీకృత వసతిగృహంలో ప్రస్తుతం 65 మంది విద్యార్థులు ఉన్నారు. ఇందులో కిటికీలు పూర్తిగా ధ్వంసంకావడంతో దుప్పట్లు అడ్డుగా పెట్టుకొని పడుకుంటున్నారు. గత ఏడాది ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ కొద్ది రోజులకే పాడైంది. దీంతో బోరు నీరే తాగుతున్నారు. ఎస్సీ వసతి గృహం భవనం చాలా పురాతనమైంది కావడంతో చిన్నపాటి వర్షానికే ఉరుస్తోంది.

● పెద్దశంకరంపేటలో సాంఘిక సంక్షేమ, బీసీ బాలికల, బాలుర వసతి గృహాల్లో 200మందికి పైగా విద్యార్థులు ఉంటున్నారు. బాలికల వసతి గృహం అద్దె భవనంలో కొనసాగుతుండడంతో సరైన సదుపాయాలు లేవు. సాంఘిక సంక్షేమ వసతిగృహంలో సోలార్ వ్యవస్థ నిరుపయోగంగా మారింది. విద్యార్థులు చల్లటి నీటితో స్నానాలు చేస్తున్నారు.

● నర్సాపూర్‌లోని సమీకృత వసతిగృహంలో 53 మంది విద్యార్థులు ఉన్నారు. కిటికీలు ధ్వంసం కావడంతో చల్లగాలి, దోమలు రాకుండా విరిగిన మంచాలు, గోనె సంచులను, దుప్పట్లను అడ్డుగా పెట్టుకున్నారు. విద్యార్థులకు పంపిణీ చేసిన దుప్పట్లు పలుచగా ఉండడంతో ఇంటి నుంచి తెచ్చుకుంటున్నారు. సరిపడా మంచాలు లేక నేలపైనే నిద్రిస్తున్నారు.



మంచాలు అడ్డుగా..

● వెల్దుర్తి బీసీ బాలుర వసతిగృహంలో 27 మంది విద్యార్థులు ఉన్నారు. శౌచాలయాలు తీవ్ర దుర్వాసన వస్తున్నాయి. వస్తువులు, దుస్తులు పెట్టుకొనేందుకు కొత్త పెట్టెలు ఇవ్వకపోవడంతో పాతవి వాడుతున్నారు.

● శివ్వంపేటలోని గిరిజన బాలుర, గోమారంలోని బీసీ బాలుర, దొంతిలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహాల్లో వేడి నీటి సౌకర్యం లేదు. కిటికీలు సరిగా లేక దోమల కుట్టి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.



చేగుంటలోని ఎస్సీ, బీసీ బాలుర, వడియారంలోని ఎస్సీ బాలికల వసతి గృహాల్లో 170 మంది విద్యార్థులు ఉన్నారు. చేగుంట ఎస్సీ బాలుర వసతిగృహంలో ఇచ్చిన దుప్పటి పలుచగా ఉండటంతో చలికి ఇబ్బందిగా ఉంది. కిటికీలకు అద్దాలు లేవు. నీటి సరఫరాకు పైపులు లేవు. చేగుంట బీసీ బాలుర వసతిగృహంలో శౌచాలయాలు లేవు.

మరమ్మతులు చేయిస్తాం..

- నాగరాజు, ఇన్‌ఛార్జి, బీసీ సంక్షేమశాఖ జిల్లా అధికారి

బీసీ వసతిగృహాల అభివృద్ధిపై మంత్రి ప్రతి వారం సమావేశాలు నిర్వహిస్తున్నారు. మరమ్మతులకు త్వరలో నిధులు మంజూరు కానున్నాయి. అవి రాగానే సమస్యలను పరిష్కరిస్తాం. వేడినీటి సౌకర్యం కోసం గతంలో ప్రతిపాదనలు పంపించాం. సమస్యలు నా దృష్టికి వస్తే వెంటనే పరిష్కరిస్తాం.

నిధులు మంజూరు కాలేదు

- శశికళ, ఎస్సీ సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి

భవనాలకు మరమ్మతులు చేయక చాలా ఏళ్లు అవుతోంది. గతంలో పనులు చేసిన వాటి బిల్లులు ఇంకా రాకపోవడంతో పీఆర్ శాఖ అధికారులు పనులు చేపట్టడంలేదు. సోలార్ సదుపాయం కోసం గతంలో ప్రతిపాదనలు పంపించాం.

● తూప్రాన్ సమీకృత బాలుర వసతిగృహంలో ఆర్వో ప్లాంట్ మరమ్మతులకు గురైంది. స్నానాలకు వేడినీరు లేదు.



● రామాయంపేట సమీకృత వసతిగృహ విద్యార్థులకు ఇప్పటి వరకు దుప్పట్లు పంపిణీ చేయలేదు.

● పాపన్నపేట బీసీ బాలుర, బీకొండ-లింగాయపల్లిలోని ఎస్సీ బాలుర, కొత్తపల్లిలోని బీసీ వసతిగృహాలు ఉన్నాయి. వీటిలో మొత్తం 215 మంది విద్యార్థులు ఉంటున్నారు. పాపన్నపేట, కొత్తపల్లిలోని భవనాలు చాలా ఏళ్ల క్రితం నిర్మించినవి కావడంతో పైకప్పులు ఊడుతున్నాయి. పాపన్నపేట భవనంలోని గదిలో నీరు లీకేజీ అవుతోంది. కిటికీలు విరిగిపోయాయి.



పాపన్నపేటలో విరిగిన కిటికీ

వాలీబాల్ విజేత మెదక్ జట్టు

మెదక్ టౌన్, రూరల్: ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి బాలుర అండర్-17 వాలీబాల్ విజేతగా మెదక్ జట్టు నిలిచింది. పాఠశాల క్రీడ సమాఖ్య(ఎస్‌జీఎఫ్) మెదక్ జిల్లా ఆధ్వర్యంలో ఆదివారం మంభోజిపల్లిలోని గీతా పాఠశాల మైదానంలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. బాలుర విభాగం ఫైనల్‌లో మెదక్, సిద్దిపేట జట్లు పోటీపడగా మెదక్ జట్టు విజేతగా నిలిచింది. ద్వితీయ స్థానంలో సిద్దిపేట, తృతీయ స్థానంలో సంగారెడ్డి జట్లు నిలిచాయి. బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో సంగారెడ్డి, ద్వితీయ స్థానంలో సిద్దిపేట, తృతీయ స్థానంలో మెదక్ జట్లు నిలిచాయి. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ.... ఉత్తమ ప్రతిభ కనబర్చిన 24 మంది క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. విజేతలకు గీతా పాఠశాల ప్రిన్సిపల్ సుగుణాకర్, ఎస్‌జీఎఫ్ మాజీ కార్యదర్శి కిషోర్, పేట జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావుతో కలిసి ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి రమేష్ జ్ఞాపికలను ప్రధానం చేశారు. వ్యాయామ ఉపాధ్యాయులు ఉన్నారు.



మెదక్ జట్టుకు జ్ఞాపిక అందజేస్తున్న ప్రతినిధులు

రైతు వ్యతిరేక విధానాలు మానుకోవాలి

మెదక్, పాపన్నపేట, న్యూస్‌టుడే: ఆచరణ సాధ్యంకాని హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ.. రైతులను నిలువునా మోసం చేస్తోందని భారాస జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి విమర్శించారు. రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని అన్నారు. ఆదివారం మెదక్ పట్టణం, పాపన్నపేటలో పార్టీ శ్రేణులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పెట్టుబడి సాయం కింద రూ.7,500 ఇవ్వకుండా రైతులను కన్నీళ్లు పెట్టిస్తోందని విమర్శించారు. తక్షణమే చెల్లించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ బట్టి జగపతి, మాజీ జడ్పీటీసీ సభ్యురాలు లావణ్య రెడ్డి, పట్టణ పార్టీ కన్వీనర్ మామిళ్ళ ఆంజనేయులు, కో-కన్వీనర్లు కృష్ణ గౌడ్, లింగారెడ్డి, జుబేర్ అహ్మద్, కౌన్సిలర్లు జయరాజ్, శ్రీనివాస్, విశ్వం, సుంకయ్య పాల్గొన్నారు.



రోడ్డుపై బైఠాయించిన భారాస జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్ రెడ్డి, నాయకులు

హామీలు అమలు చేయని కాంగ్రెస్

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్: ఎన్నికల సమయంలో సాధ్యంకాని హామీలు ఇచ్చి.. వాటిని నెరవేర్చకుండా ముఖం చాటేస్తున్న కాంగ్రెస్ పార్టీని వీడి, భారాసలో చేరాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. హత్నూర మండలం కోనంపేట కాంగ్రెస్ అధ్యక్షుడు దాసరి బాలేశ్ యాదవ్, అంబటి అర్జున్ తదితరులు ఆదివారం భారాసలో చేరారు. ఇచ్చిన హామీలు అమలుచేయని కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని ఎమ్మెల్యే అన్నారు. గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ అధ్యక్షుడు చంద్రాగౌడ్ తదితరులున్నారు.

తారు రోడ్లకు రూ.5 కోట్లు

నియోజకవర్గంలోని నాలుగు ప్రధాన తారురోడ్ల మరమ్మతులకు రూ.5కోట్ల సీఆర్ఆర్ నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే సునీతారెడ్డి తెలిపారు. నర్సాపూర్‌లో మాట్లాడుతూ.. నర్సాపూర్ మండలం మూసాపేట, హత్నూర మండలం దౌల్తాబాద్ గ్రామాల మధ్య వంతెన, తారు రోడ్డు మరమ్మతులకు రూ.కోటి, తుజాల్‌పూర్ జడ్పీ రోడ్డు నుంచి ఖాజీపేట వరకు తారు రోడ్డుకు రూ.50.35లక్షలు, మాసాయిపేట మండలం హకీంపేటకు రూ.1.83కోట్లు, జడ్పీ రోడ్డు నుంచి నాగ్సన్‌పల్లి తారు రోడ్డుకు రూ.1.65కోట్లు కేటాయించినట్లు వివరించారు. నర్సాపూర్ మున్సిపాలిటీలో రెండు భారీ నీటి ట్యాంకులు, పైప్‌లైన్ల నిర్మాణానికి రూ.12కోట్ల నిధులు కేటాయించినట్లు తెలిపారు.



భారాసలో చేరిన వారితో సునీతారెడ్డి తదితరులు

మైసమ్మ ఆలయంలో ఎంపీ పూజలు

దోమకొండ, న్యూస్‌టుడే: దోమకొండ మండలం అంబారిపేటలోని మైసమ్మ ఆలయంలో మెదక్ ఎంపీ రఘునందన్‌రావు పూజలు నిర్వహించారు. కుటుంబసభ్యులతో ఆయన ఆదివారం అమ్మవారిని దర్శించుకుని మొక్కుకున్నారు. ఆయనను మైసమ్మ ఆలయ కమిటీ ప్రతినిధులు, స్థానిక నాయకులు సన్మానించారు.



జమిలి ఎన్నికలు రాజ్యాంగ విరుద్ధం: సీపీఎం

మెదక్ టౌన్: దేశంలో జమిలి ఎన్నికలు నిర్వహించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం, ప్రజాస్వామ్యానికే ప్రమాదమని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు జగదీష్ అన్నారు. ఆదివారం మెదక్ పట్టణంలోని కేవల్ కిషన్ భవనంలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. కేంద్ర పాలకులు రాజ్యాంగంలోని ఆర్టికల్ 356ను దుర్వినియోగం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చివేస్తున్నారని ఆరోపించారు. జమిలి ఎన్నికలు నిర్వహించాలనుకుంటే కొన్ని శాసనసభల కాలపరిమితి ముగియకుండానే రద్దు చేయాల్సి ఉంటుందన్నారు. ఈ అంశాన్ని వదిలి ముందు నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మల్లేశం, కమిటీ సభ్యులు నాగరాజు, సంతోష్, అజయ్, నాగమణి, రాఘవ, యాదమ్మ, ప్రమీల తదితరులు ఉన్నారు.

డీఏ, పీఆర్సీలను వెంటనే ప్రకటించాలి: తపస్

చేగుంట: ఉపాధ్యాయులకు డీఏ, పీఆర్సీలను ప్రభుత్వం వెంటనే ప్రకటించి పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్ అన్నారు. ఆదివారం చేగుంటలో తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఇప్పటి వరకు పెండింగ్ బిల్లులు చెల్లించలేదన్నారు. సమస్యల సాధన కోసం ఈనెల 22న అన్ని పాఠశాలల్లో నల్ల బ్యాడ్జీలతో నిరసన, 29న తహసీల్దారు కార్యాలయాల వద్ద నిరసన, నవంబరు 5న జిల్లా కలెక్టరేట్‌ల వద్ద ధర్నా, 23న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. తపస్ మండల శాఖ అధ్యక్షుడు రావుల వెంకటేశ్ పాల్గొన్నారు.




మాట్లాడుతున్న నవాత్ సురేష్

జిల్లా ఉపాధ్యక్షురాలు ఎన్నిక

మెదక్, న్యూస్‌టుడే: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) జిల్లా మహిళా ఉపాధ్యక్షులుగా హేమలత, సుకన్య ఎన్నికయ్యారని మహిళా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు స్వరూపారాణి, సుజాత తెలిపారు. ఎన్నికైన వారు మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించని ప్రభుత్వం: పీఆర్టీయూ



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు కృష్ణ

మెదక్, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు సుంకరి కృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం మెదక్‌లో సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. జీవో 317 ద్వారా నష్టపోయిన ఉపాధ్యాయులను సొంత జిల్లాలకు పంపాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలతో పాటు, పీఆర్సీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సామ్యా నాయక్, రాష్ట్ర, జిల్లా బాధ్యులు వెంకట్రామిరెడ్డి, దుర్గయ్య, బస్వరాజ్, మల్లారెడ్డి, నాగులు మీరా, సత్యనారాయణ రెడ్డి, స్వరూప రాణి, శ్రీజ్యోతి మహేష్ కుమార్, దీప, అంజిబాబు పాల్గొన్నారు.

దోమకాటు.. రైతులకు గ్రహపాటు

చేతికందే దశలో ఎండిపోతున్న వరి పంట

న్యూస్‌టుడే, చేగుంట: సన్నరకం వరి సాగు చేసిన రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ప్రభుత్వం సన్నాలకు రూ.500 బోనస్ ఇస్తామని తెలపటంతో చాలా మంది రైతులు ముందుకు వచ్చి రికార్డు స్థాయిలో సాగుచేశారు. పంట చేతికి వస్తున్న తరుణంలో దోమకాటు ఆశిస్తోంది. పంట మొత్తం వ్యాప్తి చెందుతోంది. దీంతో కర్షకులకు కనీసం పెట్టుబడులు కూడా రాని పరిస్థితి నెలకొంది.

సుడులు తిరిగి..

వానాకాలం సీజన్‌లో జిల్లాలో 1.02 లక్షల ఎకరాల్లో సన్నరకం వరి సాగుచేశారు. ముఖ్యంగా చేగుంట, రామాయంపేట, మెదక్, పాపన్నపేట, హవేలీఘనపూర్, చిన్నశంకరంపేట, నార్సింగి, నిజాంపేట, వెల్దుర్తి, మాసాయిపేట, నర్సాపూర్, శివ్వంపేట, కౌడిపల్లి, కొల్చారం, చిలప్‌చెడ్ తదితర మండలాల్లో చాలా మంది రైతులు సన్నరకం వరిసాగు చేశారు. దొడ్డురకం కంటే సన్నాల దిగుబడి తక్కువగా ఉంటుంది. అయినా ఎక్కువగా సాగు చేశారు. 15 రోజుల వరకు పంట ఆశాజనకంగా ఉంది. కానీ పాలు పోసుకున్న తరువాత దోమపోటు ఆశించడంతో సుడులు తిరిగి ఎండిపోతోంది. శివ్వంపేట మండలంలో రైతు ఏకంగా పంటకు నిప్పు పెట్టుకున్నాడంటే ఎంత నష్టం చేస్తుందో తెలుస్తుంది. రూ.వేల పెట్టుబడులు పెట్టిన తర్వాత పంట చేతికి రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయాధికారుల వద్దకు వచ్చి తమ గోడును తెలుపుతూ వారిని తీసుకెళ్లి పంటను చూపిస్తున్నారు. దీంతో పాటు సన్న, దొడ్డు రకాల పంటకు మానుపండు తెగులు కూడా ఆశిస్తోంది.



నర్సంపల్లిలో దోమకాటుకు దెబ్బతిన్న వరిపంట

నివారణ చర్యలు చేపట్టాలి

– హరిప్రసాద్, ఏవో, చేగుంట

దోమ కనిపిస్తే పొలంలో ఉన్న నీటిని మొత్తం తీసివేసి ఆరబెట్టాలి. పాయలు తీసి గాలి వెలుతురు మొక్కలకు తగిలేలా చూడాలి. నత్రజని ఎరువులను తక్కువగా వాడాలి. దోమ గమనించిన తొలిదశలో ఎసిఫేట్ 75ఎస్‌పీ 1.5 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి. ఉద్ధృతి ఎక్కువగా ఉంటే డైనోటెఫ్యూరాన్ 20 ఎస్‌జీ 0.4 గ్రా. లేదా బుప్ఫ్యూరోఫిన్ 1.6 ఎంఎల్ లేదా ఫైమెట్రోజైన్ 50 డబ్ల్యూజీ 0.6 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.



కోదండరాముని ధనస్సుకు ఘనంగా పూజలు

రామాయంపేట, న్యూస్‌టుడే: అయోధ్య భాగ్యనగరి సీతారామ సేవా సమితి ఆధ్వర్యంలో కిలో బంగారం, 13కిలోల వెండితో తయారుచేసిన కోదండరాముని ధనస్సుకు ఆదివారం రామయంపేటలో ఘన స్వాగతం పలికారు. మహంకాళి ఆలయంలో పూజలు నిర్వహించి పాండా చెరువు కట్టపై ఉన్న కోదండ రామాలయానికి ఊరేగింపుగా తీసుకువచ్చారు. అలాగే వాసవి మాత ఆలయంలోనూ ధనస్సుకు పూజలు నిర్వహించారు.

22,23 తేదీల్లో నీటి సరఫరాకు అంతరాయం

నర్సాపూర్: నర్సాపూర్ నియోజకవర్గ పరిధి ఏడు మండలాలు, సంగారెడ్డి జిల్లాలోని జిన్నారం, గుమ్మడిదల మండలాలకు చెందిన 500 నివాస ప్రాంతాలకు ఈనెల 22,23వ తేదీల్లో మంజీరా నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని మిషన్ భగీరథ ఏఈ రాజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పుల్కల్ మండలం చక్రియాల ఇన్‌టెక్‌వెల్ నుంచి వచ్చే ప్రధాన పైప్‌లైన్లకు లీకేజీలు ఉండటంతో వాటికి మరమ్మతులు చేపడుతున్నట్లు చెప్పారు.

రెండు ఇళ్లలో బంగారం, వెండి చోరీ

శివ్వంపేట, న్యూస్‌టుడే: తాళం వేసి ఉన్న రెండు ఇళ్లలో దొంగలు బంగారం, వెండి, నగదు అపహరించిన ఘటన శివ్వంపేట మండలం చిన్న గొట్టిముక్ల గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాలు.. శివ్వంపేట మండలం చిన్న గొట్టిముక్ల గ్రామానికి చెందిన కొడకంచి శంకర్ గౌడ్, కులమద్ది శ్రీపతిరావు మూడు రోజుల కిందట తాళం వేసి ఊరెళ్లారు. ఆదివారం తిరిగి వచ్చేసరికి రెండు ఇళ్ల తాళాలు, అలమరి ధ్వంసం చేశారు. శంకర్ గౌడ్ ఇంట్లో రూ.1.50లక్షలు, 20తులాలు వెండి, అర తులం బంగారం, శ్రీపతిరావు ఇంట్లో రూ.5వేలు, 10తులాల వెండి అపహరించారని తెలిపారు. మెదక్ క్లూస్ టీం, శివ్వంపేట ఎస్ఐ మహిపాల్ రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

'స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి'

వర్గల్, ములుగు, న్యూస్‌టుడే: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ శ్రేణులు సత్తా చాటి అత్యధిక స్థానాలు కైవసం చేసుకోవాలని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ పిలుపునిచ్చారు. ఆదివారం డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డితో కలిసి సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం తున్కిఖల్సా పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం శ్రమించే కార్యకర్తలను కడుపులో పెట్టుకొని కాపాడుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలను తప్పుదోవ పట్టించడమే లక్ష్యంగా బీఆర్ఎస్, బీజేపీ కుట్రలు పన్నుతున్నాయన్నారు. ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు శ్రీరాం నర్సింలు, గ్రామ అధ్యక్షుడు జెల్ల మల్లేశం, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ములుగు మండలం వంటిమామిడిలో ఒక కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన నీలం మధును స్థానిక కాంగ్రెస్ నాయకులు గజమాలతో సత్కరించారు. ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు రవి, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.



నీలం మధు, నర్సారెడ్డికి జ్ఞాపికలు అందిస్తున్న తున్కిఖల్సా పెద్దమ్మతల్లి ఆలయ కమిటీ నిర్వాహకులు

నిర్వహణ ఖర్చులకు కష్టాలు

ఎమ్మార్సీలకు, సీఆర్సీలకు విడుదల కాని నిధులు

పెద్దశంకరంపేట, న్యూస్‌టుడే: ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణకు సకాలంలో నిధులు విడుదల కాకపోవడంతో నిర్వహణ భారంగా మారుతోంది. విద్యా వ్యవస్థను గాడిన పెట్టేందుకు, పాఠశాలలపై పర్యవేక్షణ పెంచేందుకు ప్రభుత్వం ప్రతి మండలానికో ఎంఈవోను నియమించింది. గత నెల వీరంతా విధుల్లో చేరారు. కొత్త మండలాల్లో కార్యాలయాలను ప్రారంభిస్తున్నారు. అయితే పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వం, మండల విద్యావనరుల కేంద్రాల(ఎమ్మార్సీ)కి నిర్వహణ నిధులు మంజూరు చేయలేదు. విద్యా సంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలు కావస్తున్నా నిధులు లేకపోవడంతో ప్రతి రోజూ నివేదిక తయారీ, రిజిష్టర్ల నిర్వహణ, అంతర్జాల వినియోగానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి.



పెద్దశంకరంపేట మండల వనరుల కేంద్రం

ప్రతినెలా రూ.1.25లక్షలు అవసరం

జిల్లాలో 15 పాత మండలాలు, 6 కొత్త మండలాలు ఉన్నాయి. గత నెల వరకు జిల్లాకు ఇద్దరు ఎంఈవోలతో నిర్వహణ కొనసాగింది. మండల నోడల్ అధికారులకు ప్రభుత్వం ఎంఈవోలుగా బాధ్యతలు అప్పగించింది. దీంతో 21 మండలాలకు పూర్తిస్థాయిలో నియమితులయ్యారు. వీరికి నిర్వహణ నిధుల అవసరం నెలకొంది. సిబ్బంది నియామకం చేపట్టాల్సి ఉంది. ఏటా ఒక్కో ఎమ్మార్సీకి రూ.1.25 లక్ష చొప్పున జిల్లాకు మొత్తం రూ.26,25,000 అందాల్సి ఉంది. నిధుల్లేక కార్యాలయాల్లో చిన్నపాటి మరమ్మతులు, విద్యుత్తు బిల్లులు, సమావేశాల నిర్వహణ ఖర్చు, అంతర్జాల వినియోగం, స్టేషనరీ, పత్రికల ఖర్చు కోసం ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

త్వరలో విడుదలయ్యే అవకాశం

– రాధాకిషన్, జిల్లా విద్యాధికారి

ఇటీవల పాఠశాలల నిర్వహణ నిధులు విడుదలయ్యాయి. ఎమ్మార్సీలకు, సీఆర్సీలకు కూడా ప్రభుత్వం త్వరలో నిధులు విడుదల చేసే అవకాశం ఉంది. నిధులు విడుదల కాగానే ఖాతాల్లో జమ అవుతాయి.

సమావేశాలకు ఇబ్బందే..

పాఠశాల సముదాయ కేంద్రాల పర్యవేక్షణపై సీనియర్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలకు ప్రత్యేకమైన అధికారాలు ఉన్నాయి. ఇప్పటికే రెండు దఫాలుగా సమావేశాలు నిర్వహించారు. అయినా నిధులు విడుదల కాకపోవడంతో రికార్డుల నిర్వహణ, సమావేశాల ఖర్చులకు పీజీహెచ్ఎంలు ఇబ్బందులు పడుతున్నారు. ఫలితంగా పాఠశాలల పర్యవేక్షణ అంతంతమాత్రంగా ఉందనే వాదన వినిపిస్తోంది. జిల్లా వ్యాప్తంగా 61 సీఆర్సీలు ఉండగా, ఏటా ఒక్కో దానికి రూ.28 వేల చొప్పున మొత్తం రూ.17.08 లక్షల నిధులు రావాల్సి ఉంది.

శౌర్యానికి ప్రతీక సేవా దీపిక

నేడు ఫ్లాగ్ డే


న్యూస్‌టుడే, సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి అర్బన్, వికారాబాద్

ఎక్కడ ఘర్షణలు తలెత్తినా.. నాయకులు, ప్రజల మధ్య గొడవలు చోటుచేసుకున్నా ముందుగా ప్రత్యక్షమయ్యేది పోలీసే. రాత్రి, పగలు తేడా లేకుండా శాంతిస్థాపనే లక్ష్యంగా అలుపెరుగక ముందుకు సాగుతున్న రక్షకులకు సెల్యూట్ చేయాల్సిందే. శాంతిభద్రతల రక్షణకు శ్రమించే ఎంతో మంది ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. సమాజాన్నే కుటుంబంగా భావించే ఖాకీలు అంకితభావంతో వృత్తి ధర్మాన్ని నిర్వర్తిస్తున్నారు. సాంకేతికత తోడుగా నేరాలను ఛేదిస్తున్నారు. సేవా స్ఫూర్తి చాటుతూనే ప్రజా చైతన్యం తెస్తున్నారు. నేడు పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవం (ఫ్లాగ్‌డే) సందర్భంగా కథనం.

నాన్న బాటలో అడుగేసి..



మెదక్ జిల్లా పాపన్నపేట పోలీస్‌స్టేషన్‌పై 1999 సెప్టెంబరు 13న రాత్రి మావోయిస్టులు జరిపిన దాడిలో ఒక హెడ్ కానిస్టేబుల్, నలుగురు కానిస్టేబుళ్లు ప్రాణాలు కోల్పోయారు. మృతి చెందిన వారిలో సంగారెడ్డికి చెందిన కానిస్టేబుల్ ప్రసాద్ ఉన్నారు. ఆయన రెండో కుమారుడు విద్యాసాగర్ నాన్న బాటలో నడవాలని నిర్ణయించుకున్నారు. ఈ శాఖలోనే చేరి ప్రస్తుతం మెదక్ జిల్లా పోలీసు కార్యాలయంలో సీనియర్ సహాయకుడిగా పని చేస్తున్నారు. - పాపన్నపేట



	సిద్దిపేట	సంగారెడ్డి	మెదక్	వికారాబాద్
పోలీసు స్టేషన్లు	27	32	21	19
అధికారులు, సిబ్బంది	1227	796	788	1191
హోంగార్డులు	208	274	146	696
కళాబృందం	01	01	01	03

స్నేహపూర్వకంగా..



వివిధ సందర్భాల్లో మహిళలకు బాసటగా నిలవడంలో 'స్నేహిత' ముందంజలో నిలుస్తోంది. సిద్దిపేట వన్‌టౌన్ పోలీసు ఠాణా సమీపంలో గతేడాది జనవరి 5న ఈ మహిళా సహాయక కేంద్రం ప్రారంభమైంది. ఇప్పటి వరకు 1,261 ఫిర్యాదులు స్వీకరించగా పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. పోలీసు స్టేషన్లలో నమోదయ్యే మహిళల కేసులు.. జిల్లా కేంద్రంలోని మహిళా పోలీసు ఠాణాకు, తదుపరి 'స్నేహిత'కు చేరవేస్తున్నారు. అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ సహకారంతో కొనసాగుతోంది. సీపీ డా. అనురాధ సమీక్షిస్తూ.. దిశానిర్దేశం చేస్తున్నారు. స్వార్డ్ సంస్థ కార్యదర్శి శివకుమారి పర్యవేక్షిస్తున్నారు. వారంలో ఒకరోజు న్యాయవాది అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తున్నారు. మూడు నుంచి ఐదుమార్లు కౌన్సెలింగ్ చేస్తున్నారు.

ఆనాటి ఘటనలు..

● హుస్నాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: 1991లో హుస్నాబాద్ సీఐ యాదగిరి, ఎస్‌ఐ జాన్‌విల్సన్ హుస్నాబాద్ మండలం రామవరంలో బస్సును పీపుల్స్‌వార్ దళ సభ్యులు బాంబుతో పేల్చివేయడంతో ప్రాణాలు కోల్పోయారు. దౌల్తాబాద్ ఎస్‌ఐ రాజగోపాలచారి, హెడ్‌కానిస్టేబుల్ చంద్రయ్య.. దౌల్తాబాద్ శివారులో నక్సలైట్ల కాల్పుల్లో మరణించారు.● 1997 నవంబరు 17న శివ్వంపేట మండలం పిల్లుట్లలో నక్సల్స్ ఓ ఇంటిని పేల్చారు. దాని పరిశీలనకు వెళ్లిన అప్పటి తూప్రాన్ డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, సీఐ వెంకటస్వామి, హెడ్ కానిస్టేబుల్ పెంటయ్య, శ్రీనివాసరావు, సుజత్‌అలీ, లక్ష్మణ్‌నాయక్ మందుపాతర పేలుడులో చనిపోయారు.● 2012 మార్చి 28న అర్ధరాత్రి వేళ కోహీర్‌లోని సిండికేట్ బ్యాంకులో అంతర్రాష్ట్ర ముఠా సభ్యులు కలిసి బ్యాంకు దోపిడీ చేస్తున్నట్లు సైరన్ మోగింది. స్థానిక పోలీసులకు సమాచారం అందగా ఎస్‌ఐ నోముల వెంకటేశ్, హెడ్ కానిస్టేబుల్ భాస్కర్ వెళ్లారు. వారిని పట్టుకునే యత్నంలో దోపిడీ దొంగలు నాటు తుపాకులతో కాల్చగా ఎస్‌ఐకి తూటా తగిలింది. అయినా లెక్క చేయకుండా వారిని పట్టుకున్నారు.

30 గంటల్లో ..

సంగారెడ్డిలోని జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో అమ్మమ్మ, నాయనమ్మ కళ్లు గప్పి పసికందును గుర్తుతెలియని మహిళలు అపహరించారు. పోలీసులు సాంకేతిక సాయంతో 30 గంటల్లో ఛేదించారు. మనూరు మండలం దూదిగొండకు చెందిన అబ్బాస్, నసీమా దంపతులు. నసీమా ఈ నెల 8న ప్రసవానికి ఆసుపత్రిలో చేరగా ఆడపిల్ల జన్మించింది. మరుసటి రోజు ఇద్దరు మహిళలు పాపను ఎత్తుకెళ్లారు. సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్, పట్టణ సీఐ భాస్కర్‌లు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఎస్పీ చెన్నూరి రూపేష్ సూచనలతో సీసీ కెమెరాలను పరిశీలించారు. తనిఖీలు ముమ్మరం చేశారు. హైదరాబాద్‌లోని బోరబండలో నిందితులు ఉన్నట్లు గుర్తించి అక్కడికి వెళ్లి వారిని పట్టుకున్నారు. పసికందును తల్లి ఒడికి చేర్చారు.




తల్లికి చిన్నారిని అప్పగించిన డీఎస్పీ, సీఐ

సైబర్ క్రైమ్ పోలీసు ఠాణాతో..




సైబర్ నేరాల అడ్డుకట్టపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. గతేడాది ఆగస్టులో సిద్దిపేట పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్ అందుబాటులోకి తెచ్చారు. ఏసీపీ, ఇన్‌స్పెక్టర్, ఐదుగురు సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. రూ.లక్షకు పైగా సైబర్ మోసం జరిగితే ఫిర్యాదు చేసే అవకాశం కల్పించారు. వివిధ స్థాయిల్లో దర్యాప్తును ఠాణాల వారీగా పోలీసులకు మార్గనిర్దేశనం చేస్తున్నారు. సాంకేతికతతో ఛేదిస్తున్నారు. సామాజిక మాధ్యమాలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు.

మూడు తరాల్లో..



ఇమామ్



జాని బాషా



నయీమ్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా నకిరేకల్ మండలం గుండ్లపల్లికి చెందిన షేక్ ఇమామ్ సాహెబ్ కానిస్టేబుల్‌గా పని చేసి 1989లో పదవీ విరమణ పొందాడు. ఆయన స్ఫూర్తితో కొడుకు షేక్ జానిబాషా 1992లో కానిస్టేబుల్ ఉద్యోగం సాధించారు. తూప్రాన్‌లో హెడ్ కానిస్టేబుల్ విధులు నిర్వర్తిస్తున్నారు. జానిబాషా కొడుకు షేక్ నయీమ్ పాషా హైదరాబాద్ కొండాపూర్‌లో కానిస్టేబుల్ శిక్షణ పొందుతున్నారు. మూడు తరాల వారు పోలీసుల శాఖలోనే ఉండటం గమనార్హం. - న్యూస్‌టుడే, తూప్రాన్

గజపాద ఘట్టం.. వీక్షించిన భక్తజనం



ఫసల్‌వాదిలో గజరాజు ప్రదర్శన



సామూహిక కుంకుమార్చనలో భక్తులు

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: సంగారెడ్డి మండలం ఫసల్‌వాదిలోని జ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో ఆదివారం గజపాద ఘట్ట మహోత్సవం కార్యక్రమం ఘనంగా జరిగింది. ముందుగా విద్యాపీఠం నుంచి మంజీరా తీరం వరకు ఊరేగింపు చేపట్టారు. నదిలో గజరాజుకు స్నానం చేయించారు. అనంతరం విద్యాపీఠంలో నిర్మిస్తున్న ఆలయం చుట్టూ గజపాద ఘట్ట మహోత్సవం నిర్వహించారు. గజరాజుతో ప్రదర్శన చేపట్టారు. అనంతరం సామూహిక కుంకుమార్చన జరపగా.. స్థానిక భక్తులు పాల్గొన్నారు. ఆటపాటలు, కోలాటంతో అలరించారు. పీఠం వ్యవస్థాపకులు మహేశ్వర శర్మ సిద్ధాంతి తదితరులున్నారు.

బాధిత కుటుంబానికి నష్టపరిహారం

పేట్‌బషీరాబాద్, న్యూస్‌టుడే: మెదక్ జిల్లా చేగుంట మండలానికి చెందిన పాండ్యాల రాజుగౌడ్ తన కుటుంబంతో కలిసి బతుకుదెరువు నిమిత్తం పద్మానగర్ ఫేజ్2కు వచ్చి నివసిస్తున్నాడు. ఇంటి యజమానురాలు సురేఖ ఇంటి గోడలు షాక్ కొడుతున్నాయని చెప్పడంతో రాజుగౌడ్ వచ్చి పరిశీలిస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వివేకానంద్ విద్యుత్తు అధికారులతో మాట్లాడి రూ.5 లక్షలు మంజూరు చేయించారు. ఆ చెక్కును ఎమ్మెల్యే రాజు భార్య నవ్యకు ఆదివారం అందజేశారు.

పురుగుమందు తాగి దంపతుల ఆత్మహత్య



ప్రతాప్‌సింగ్



కళావతి

ఝరాసంగం, న్యూస్‌టుడే: కుటుంబ కలహాలతో దంపతులు పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం సంగారెడ్డి జిల్లా ఝరాసంగంలో ఆదివారం చోటుచేసుకుంది. రూరల్ సీఐ హన్మంతు, ఎస్సై నరేశ్ వివరాల ప్రకారం.. ఝరాసంగానికి చెందిన బొందిల ప్రతాప్‌సింగ్(60), కళావతి(55) దంపతులు కొన్నేళ్లుగా కేతకి ఆలయ సమీపంలో అల్పాహారం, టీ స్టాల్ నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నారు. కొన్నాళ్లుగా వ్యాపారంలో నష్టాలు రావడంతో కుటుంబ పోషణ భారంగా మారింది. ఈ క్రమంలో తరచుగా భార్యభర్తల మధ్య గొడవలు కూడా జరుగుతున్నాయి. ఆదివారం సాయంత్రం గ్రామ సమీపంలో వారి వ్యవసాయ పొలం వద్దకు వెళ్లిన ఇద్దరు అక్కడే పురుగుమందు తాగి పడిపోయారు. చుట్టుపక్కల పొలాల రైతులు గుర్తించి వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందారు. ఈ దంపతులకు ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. వీరికి వివాహాలు అయ్యాయి. కుమారుడు తల్లిదండ్రుల నుంచి వేరుగా ఉంటున్నాడు. ప్రతాప్‌సింగ్ సోదరుడు సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కాలువలో స్నానానికి దిగి మృత్యువాత



గోపాల్

న్యాల్‌కల్, జహీరాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: స్నానానికి వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతిచెందిన ఘటన సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం చాల్కి గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. హద్నూర్ పోలీసుల కథనం ప్రకారం... రంజోల్ గ్రామానికి చెందిన కమ్మరి గోపాల్(21) జహీరాబాద్, పస్తాపూర్, చాల్కి ప్రాంతాల్లో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. వచ్చిన డబ్బులను నిత్యం మద్యం తాగడానికి ఖర్చు చేసేవాడు. రెండు మూడు రోజులుగా ఆయన పనికి వెళ్లడం లేదు. రెండు రోజుల కిందట చాల్కిలోని కొత్త కాలువకు స్నానానికి వెళ్లిన గోపాల్ ప్రమాదవశాత్తు అందులో పడిపోయాడు. దీనికి ఎవరూ గుర్తించలేదు. ఆదివారం నీటిలో కనిపించిన మృతదేహాన్ని గ్రామస్థులు గుర్తించి కుటుంబ సభ్యులకు తెలిపారు. గోపాల్ మృతిపై అనుమానాలు లేవని, ప్రమాదవశాత్తు మృతిచెంది ఉంటాడని కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

బస్సెక్కుతుండగా... ఆభరణాల చోరీ

నారాయణఖేడ్: ఓ మహిళ బస్సు ఎక్కుతుండగా బ్యాగు నుంచి గుర్తుతెలియని వ్యక్తులు 6.30 తులాల బంగారు ఆభరణాలు చోరీ చేసిన ఘటన ఆదివారం స్థానికంగా చోటుచేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం... నాగల్‌గిద్ద మండలం ఎనక్‌పల్లికి చెందిన నిర్మల కొన్నేళ్లుగా కుటుంబీకులతో కలిసి హైదరాబాద్‌లో ఉంటున్నారు. సిర్గాపూర్ మండలం ఉజలంపాడ్‌లో బంధువుల ఇంట్లో ఓ శుభకార్యం నిమిత్తం వచ్చి తిరిగి వెళ్తుండగా ఖేడ్ రాజీవ్ కూడలిలో ఈ ఘటన చోటుచేసుకుంది. బాధితురాలు ఖేడ్ ఠాణాలో ఫిర్యాదు చేయగా.. పోలీసులు విచారిస్తున్నారు.



చికెన్ ధరలు			
ఫాంరేటు	120–00	డ్రెస్డ్	206–00
రిటైల్	142–00	స్కిన్‌లెస్	234–00

పత్తి రైతులకు తప్పనున్న నిరీక్షణ

న్యూస్‌టుడే, గజ్వేల్, సంగారెడ్డి అర్బన్, మెదక్, పరిగి



గజ్వేల్ సీసీఐ కేంద్రంలో బారులు తీరి..

ఉమ్మడి మెదక్ జిల్లాలో వరి సాగు తర్వాతి స్థానం పత్తిదే. వికారాబాద్ జిల్లాలో ఇది మూడో స్థానంలో ఉంటుంది. ప్రస్తుతం పత్తి చేతికొచ్చే సమయం కావడంతో దీన్ని సాగు చేసిన రైతులు విక్రయించేందుకు మిల్లుల వద్ద పడే నిరీక్షిస్తుంటారు. దీనికి ఇక నుంచి తెరపడనుంది. ప్రస్తుతం పొలాల క్రయ, విక్రయాలకు అమలు చేస్తున్న స్లాట్ విధానాన్ని పత్తి విక్రయాల్లోనూ అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే నిర్మల్ జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్న ఈ విధానాన్ని త్వరలోనే అన్ని జిల్లాల్లో శ్రీకారం చుట్టనుండటం విశేషం.

సీసీఐ కేంద్రాల్లో..

పొలాల నుంచి సేకరించిన పత్తిని సీసీఐ కేంద్రాల్లో అమ్మేందుకు వెళ్లే రైతులు ఒక్కోసారి జిన్నింగ్ మిల్లుల గేట్ల వద్ద నిరీక్షిస్తుంటారు. పలు సందర్భాల్లో అక్కడే నిద్రించి తమ వంతు ఎప్పుడొస్తుందా అని రోజులకొద్దీ ఎదురు చూసే పరిస్థితి. దీంతో ఎంతో మంది ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరకే అమ్ముకొని నష్టపోతుంటారు. పత్తి కొనుగోళ్లలో జాప్యం జరుగుతోందని రైతులు ధర్నాలు చేసిన ఘటనలెన్నో ఉన్నాయి. వీటికి చెక్ పెట్టేందుకు కొత్త విధానం ఉపయోగపడనుంది.

54 స్పిన్నింగ్ మిల్లులు..

సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లో 46 మిల్లుల్లో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలు కొనసాగుతున్నాయి. మెదక్ జిల్లాలో మిల్లులు లేవు. ఇక్కడి వారంతా సంగారెడ్డి, సిద్దిపేటకు వెళ్తుంటారు. వికారాబాద్ జిల్లాలో 8 మిల్లులు ఉన్నాయి.

ఎలా చేస్తారంటే..

పత్తి రైతులు ముందుగా స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తేదీ, సమయం సూచిస్తూ సమాచారాన్ని రైతుల చరవాణికి పంపిస్తారు. ఆరోజు నేరుగా కేటాయించిన మిల్లుకు దిగుబడిని తీసుకొచ్చి అమ్ముకోవచ్చు.

సిద్దిపేట ■ సంగారెడ్డి ■ మెదక్ ■ వికారాబాద్ ■

	సిద్దిపేట	సంగారెడ్డి	మెదక్	వికారాబాద్
నాలుగు జిల్లాల్లో పత్తి సాగు (లక్షల ఎకరాల్లో)	3.35	1.04	0.36	2.5
జిన్నింగ్ మిల్లులు	24	22	00	08

మద్దతు ధర
పొడవు రకం: రూ.7521
మధ్య రకం: రూ.7121

పంట రక్షణ తీగ.. ప్రాణం తీసింది

తల్లి, అన్న కళ్లముందే తమ్ముడి దుర్మరణం



బాలరాజు

పరిగి, పరిగి గ్రామీణ, న్యూస్‌టుడే: ఇద్దరు కొడుకులు తల్లి కలిసి.. సీతాఫలాలు అమ్మారు. చీకటి పడగానే.. ముగ్గురూ ముచ్చట్లోపడి.. ఇంటి దారి పట్టారు. అంతలోనే.. ముందు నడుస్తున్న చిన్నకొడుకు కాలికి విద్యుత్తు తీగ తగిలింది. గిలగిలా కొట్టుకుంటున్న ఆ బిడ్డను రక్షించలేక.. తన తమ్ముడు తన కళ్లముందే.. మృత్యువుతో పోరాడుతున్నా.. ఏం చేయలేని నిస్సహాయతతో ఇద్దరూ విలవిల్లాడారు. పరిగి మండలం రంగంపల్లిలో ఈ విషాదకరఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. రంగంపల్లి గ్రామానికి చెందిన ఎలిచెలి పార్వతమ్మకు ఇద్దరు కుమారులు రాములు, బాలరాజు (28) ఉన్నారు. వారంతా వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుత సీజన్‌లో సీతాఫలాలు విక్రయిస్తున్నారు. అడవిలో సేకరించిన ఫలాల్ని బీజాపూర్ జాతీయ రహదారి పక్కనే ఉన్న చింతల్‌చెరువులో అమ్మకాలు సాగిస్తున్నారు. శనివారం ముగ్గురూ కలిసి కాయలను అమ్మకాలు జరిపారు. తిరుగు ప్రయాణంలో అదే గ్రామానికి చెందిన కౌలు రౌతు పిట్ల వెంకటయ్య పొలం దారిలో ఇంటికి వెళుతున్నారు. రైతు అడవి పందుల నుంచి రక్షణకు ఏర్పాటు చేసిన.. విద్యుత్తు తీగపై బాలరాజు కాలు పడింది. దీంతో కరెంటు సరఫరా జరిగి ఒక్కసారిగా కిందపడి కొట్టుకుంటున్నాడు. అతడిని కాపాడేందుకు తల్లి ప్రయత్నించగా.. రాములు వెంటనే తల్లిని వెనక్కి జరగాలని బిగ్గరగా అరిచాడు. అంతే.. ఆమె వెనక్కి జరగగా.. క్షణాల్లో బాలరాజు అచేతనంగా పడిపోయాడు. వారి కేకలు విన్న గ్రామస్థులు అక్కడికి చేరుకున్నారు. విద్యుత్తు సరఫరా నిలిపివేసి పరిశీలించగా.. యువకుడు తుది శ్వాస విడిచాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

వాహనం మలుపు తీసుకుంటుండగా ప్రమాదం.. మెకానిక్ మృతి



స్వామి

బెజ్జంకి, న్యూస్‌టుడే: రాజీవ్ రహదారి కూడలిలో మలుపు తీసుకుంటున్న ద్విచక్ర వాహనదారుడిని కారు వేగంగా ఢీకొట్టడంతో తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా బెజ్జంకి క్రాసింగ్‌లో చోటుచేసుకుంది. ఎస్సై కృష్ణారెడ్డి సమాచారం ప్రకారం.. గ్రామానికి చెందిన బింగి స్వామి(42) ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. ఈ నెల 19న గాగిళ్లాపూర్‌లో పని నిమిత్తం తన వాహనంపై వెళ్లి తిరుగుపయనమయ్యాడు. పెట్రోల్ పోసుకునేందుకు గ్రామ శివారులో మలుపు తీసుకుంటుండగా హైదరాబాద్ నుంచి కరీంనగర్ వెళ్తున్న కారు ఢీ కొట్టింది. ప్రైవేటు ఆస్పత్రికి స్వామిని తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. కుమారుడు వంశీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

బైకు అదుపుతప్పి రైతు..



నర్సింలు

మిరుదొడ్డి, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఒకరు మృతి చెందిన ఘటన సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట- భూంపల్లి మండలం ఖాజీపూర్ శివారులో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై హరీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. దౌల్తాబాద్ మండలం గాజులపల్లిలో పోచమ్మ ఆలయం నిర్మాణం చేపడుతున్నారు. గ్రామానికి చెందిన రైతు గొల్లపల్లి చిన్న నర్సింలు (58) మరికొందరు గ్రామస్థులతో కలిసి తుజాల్‌పూర్‌లోని ఆలయ నమూనాను పరిశీలించడానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో వాహనం అదుపుతప్పి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య నర్సవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్రీస్తును స్మరించి.. భక్తితో ఆరాధించి



భక్తిగీతాలు ఆలపిస్తున్న భక్త బృందం

మెదక్ అర్బన్, న్యూస్‌టుడే: క్రీస్తు నామస్మరణతో ప్రఖ్యాత మెదక్ సీఎస్‌ఐ చర్చి ఆదివారం సందడిగా మారింది. గురువులు శిలువను ఊరేగింపుగా తీసుకొచ్చి ప్రార్థనా మందిరంలో ప్రతిష్ఠించారు. మెదక్ ప్రెసిబేటరి ఇన్‌ఛార్జి శాంతయ్య ఆధ్వర్యంలో ఆరాధనలు చేపట్టారు. ఆయనతో పాటు వనస్థలిపురం ప్రెసిబేటరీ ఇన్‌ఛార్జి జాన్ సుందర్ దైవసందేశాన్ని వినిపించారు. ఉమ్మడి జిల్లాతో పాటు పొరుగు జిల్లాల, రాష్ట్రాల నుంచి భక్తులు, పర్యాటకులు కుటుంబ సమేతంగా తరలివచ్చి ఏసయ్యను దర్శించుకుని తన్మయత్వం పొందారు. భక్త బృందం క్రీస్తును స్తుతిస్తూ పాడిన పాటలు అలరించాయి. గురువులు డేవిడ్ రిచార్డ్, జైపాల్, శ్రీనివాస్ భక్తులకు ఆశీర్వచనాలు అందించారు.

స్వర్ణోత్సవ ఆత్మీయ సమ్మేళనం



సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పూర్వ విద్యార్థులు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కళాశాలలో 1972-75 బీఎస్సీ ఎంపీసీ బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు స్వర్ణోత్సవ వేడుకలు నిర్వహించారు. 50 వసంతాల తర్వాత అంతా ఒకచోటుకు చేరి ఆత్మీయంగా పలకరించుకుంటూ తమ మధురజ్ఞాపకాలు పంచుకున్నారు. వీరిలో ప్రముఖ కవి, తెలంగాణ సాహిత్య అకాడమీ ప్రథమ అధ్యక్షుడు నందిని సిధారెడ్డి, ఉస్మానియా విశ్వవిద్యాలయం మాజీ రిజిస్ట్రార్ నాగభూషణం, భాజపా రాష్ట్ర నాయకులు వంగ రాంచంద్రారెడ్డి, వీహెచ్‌పీ తెలంగాణ పూర్వ ఆర్గనైజర్ గాల్‌రెడ్డి, సీనియర్ జర్నలిస్టు కొమురవెల్లి అంజయ్య తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపల్ డా.అయోధ్యరెడ్డిని సన్మానించారు.

సాఫ్ట్‌బాల్ పోటీల విజేత నిజామాబాద్ జట్టు



నిజామాబాద్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న సీఐలు కంప రవీందర్, రాఘవేందర్ తదితరులు

ఎనుమాముల మార్కెట్, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ 2024-25 పోటీల్లో నిజామాబాద్ జట్టు మొదటి, మహబూబ్‌నగర్ జట్టు ద్వితీయ, మెదక్ జట్టు తృతీయ పతకాలు సాధించినట్లు వరంగల్ జిల్లా సాఫ్ట్‌బాల్ సంఘం అధ్యక్షుడు వీరగోని రాజ్‌కుమార్ తెలిపారు. రామగుండం స్పెషల్‌బ్రాంచ్ సీఐ కంప రవీందర్, ఎనుమాముల సీఐ రాఘవేందర్ విజేతలకు బహుమతులు అందజేశారు. వరంగల్ రెడ్డిపాలెంలోని ఇన్ఫాంట్ జీసస్ కాన్వెంట్ పాఠశాలలో ఆదివారం జరిగిన ముగింపు సమావేశాల్లో ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సహజమని పేర్కొన్నారు. జీవితంలో గెలుపు కోసం నిరంతరం శ్రమించాలని క్రీడాకారులకు సూచించారు. సాఫ్ట్‌బాల్ సంఘం కార్యదర్శి పూజారి అశోక్‌బాబు, బీమగాని ముఖర్జీ, పాఠశాల ప్రిన్సిపల్ మరియమ్మ మాథ్యూ పాల్గొన్నారు.

వృద్ధులకు ఆరోగ్య భరోసా

ప్రత్యేక యాప్‌లో వివరాల నమోదు

న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్, సిద్దిపేట, మెదక్, వికారాబాద్ కలెక్టరేట్



సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ వార్డు

వృద్ధాప్యంలో ఎన్నో మార్పులు చోటుచేసుకుంటాయి. ఈ వయసులో ఉన్న వారిని పసి పిల్లలుగా కంటికి రెప్పలా కాపాడుకోవాల్సి ఉంటుంది. కొంత మందికి కుమారులు ఉన్నా వేదనే మిగులుతోంది. రోగాలబారిన పడ్డా ఎవరూ పట్టించుకోరు. ఇలాంటి కష్టకాలంలో ఉన్న వయోవృద్ధులకు మేమున్నాం అంటూ భరోసా కల్పించేలా ఉచిత వైద్య సేవలు అందించాలని కేంద్రం సంకల్పించింది. ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా ఈ ప్రక్రియ అమలు చేయనుంది. ఇందుకు వారి వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేయనున్నారు.

1835 రకాలుగా..

ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా అన్ని వయసుల వారికి రూ.10 లక్షల వరకు వైద్య సేవలు అందిస్తున్న విషయం విదితమే. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లోని రాజీవ్ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ఈ సేవలు అందిస్తున్నారు. ఈ పథకం కింద 1835 రకాల రోగాలు ఉన్న వారికి దీన్ని వర్తింపజేస్తున్నారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమలుచేస్తోంది. దీని కింద వయోవృద్ధులకు ఉచిత వైద్య సేవలు అందించాలని నిర్ణయం తీసుకోవడంతో నాలుగు జిల్లాల వారికి మేలు చేకూరనుంది.

జిల్లాల్లో వయోవృద్ధులు	
సంగారెడ్డి	61,991
సిద్దిపేట	40,360
మెదక్	32,130
వికారాబాద్	39,153

దరఖాస్తు ఇలా..

ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన (ఏబీపీఎంజేఏవై) వెబ్‌సైట్ https:///ayushmanup.in ను సందర్శించాలి. అందులో ఆయుష్మాన్ భారత్(ఏఎంఐ) ఎలిజిబుల్ ట్యాబ్‌పై క్లిక్ చేయాలి. చరవాణి నంబరు నమోదు చేస్తే ఓటీపీ వస్తుంది. దానితో ధ్రువీకరించుకోవాలి. గ్రామం, మండలం, జిల్లా, రాష్ట్రం వివరాలు, ఆధార్ కార్డు వివరాలు నమోదు చేయాలి. ఇలా ఈ-కేవైసీ పూర్తవగానే ఆమోదం కోసం వేచి ఉండాలి. ఈ ప్రక్రియ పూర్తయితే కార్డు తెరపై కనిపిస్తుంది. దాన్ని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

యాప్‌లో నమోదుకు..:



కేంద్రం ఆయుష్మాన్ భారత్ పథకం కింద 70 ఏళ్ల పైబడిన వయోవృద్ధులకు ప్రత్యేకంగా కార్డులు జారీ చేయాలని ఆదేశాలు ఇచ్చింది. ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి. మీసేవ, కామన్ సర్వీస్ సెంటర్లలో కార్డులు పొందవచ్చు.

నరేష్, రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్, జిల్లా సమన్వయకర్త, సంగారెడ్డి

ప్రయోజనాలిలా..

రూ.5 లక్షల వైద్య సాయం పొందే వీలుంది. మూడు రోజుల పాటు ఉచితంగా ఆసుపత్రిలో చేర్చుకోవడం, వైద్య పరీక్షలు, చికిత్స, ఇంటెన్సివ్‌కేర్ తదితర సేవలు పొందవచ్చు. దవాఖానాలో చేరాక 15 రోజుల వరకు సంరక్షణ ఉచితంగా లభిస్తుంది. మందులు, వసతి, పోషకాహారం అందజేస్తారు.

భాషల పరిరక్షణ తప్పనిసరి: వీసీ



అవార్డు గ్రహీతలు

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే : భారతీయ భాషలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని వీఎస్‌యూ వీసీ విజయభాస్కర్ రావు ఉద్బోధించారు. లేకుంటే భవిష్యత్తులో ప్రమాదంలో పడతాయన్నారు. అఖిల భారత భాషా సాహిత్య సమ్మేళన్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా కళాశాలలో సదస్సు చేపట్టారు. పలు రాష్ట్రాల నుంచి వచ్చిన సాహితీవేత్తలకు అవార్డులు, పురస్కారాలు అందించారు. కార్యక్రమంలో డీకే ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.గిరి, అఖిల భారత భాషా సాహిత్య సమ్మేళన్ జాతీయ అధ్యక్షులు వీరేంద్రసింగ్, ప్రధాన కార్యదర్శి చతుర్వేది, తెలంగాణ అధ్యక్షులు సత్యమూర్తి, కార్యదర్శి చక్రవర్తి, మద్రాస్ విశ్వవిద్యాలయం ఆచార్యులు ఎలిజబెత్ జయకుమారి, ఒడియా కవయిత్రి సుశ్రీసంగీత మిశ్ర, ఆంగ్ల కవి లక్ష్మణరావు, హిందీ రచయిత రామలింగేశ్వరరావు, నారాయణ ఐఏఎస్ అకాడమీ ప్రిన్సిపల్ కె.సరోజినీదేవి, కవి పెరుగు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తునికి ఆలయంలో భక్తుల రద్దీ


అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు.

కౌడిపల్లి, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రసిద్ధి చెందిన కౌడిపల్లి మండలం తునికి శివారులో వెలసిన నల్ల పోచమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసి పోయింది. ఉమ్మడి జిల్లాతో పాటు జంట నగరాల నుంచి విశేష సంఖ్యలో తరలివచ్చారు. ఒడి బియ్యంతో పాటు బోనాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

చేగుంట, న్యూస్‌టుడే: మండల పరిధి కర్నాల్‌పల్లిలో రేణుకా ఎల్లమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. జిల్లాతో పాటు హైదరాబాద్ నుంచి భక్తులు వందలాదిగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం కొందరు కొందరు భక్తులు ఒడి బియ్యం పోసి, బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.


రేణుకా ఎల్లమ్మ

అనంతసాగర్‌లో సరస్వతి యజ్ఞం

చేగుంట, న్యూస్‌టుడే: మండలంలోని అనంతసాగర్‌లో ఆదివారం సరస్వతి యజ్ఞాన్ని ఘనంగా నిర్వహించారు. సరస్వతి భక్తుడు బచ్చు రమేష్‌గుప్తా ఏర్పాటు చేసిన 496వ యజ్ఞానికి చేగుంట, రామాయంపేట, నార్సింగి, మెదక్, తూప్రాన్, మాసాయిపేట, చిన్నశంకరంపేటతో పాటు సిద్దిపేట జిల్లా నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

తూప్రాన్, న్యూస్‌టుడే: మండలంలోని ఘనపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2009-10 సంవత్సరం పదో తరగతి చదివిన విద్యార్థులు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆదివారం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో నాడు చదువు చెప్పిన గురువులను సన్మానించారు. ఈ సందర్భంగా నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని సంతోషంగా గడిపారు.

రేపు కలెక్టరేట్ ముట్టడి

గజ్వేల్: ఉపకార వేతనాలు, బోధనా రుసుములను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండు చేస్తూ మంగళవారం నిర్వహించ తలపెట్టిన కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం గజ్వేల్ బాధ్యుడు నర్సింలు ఆదివారం గజ్వేల్‌లో కోరారు. ప్రభుత్వం స్పందించి నిధులు విడుదల చేసే వరకు బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పోరాటాన్ని నిర్వహిస్తామన్నారు.

'భారాస అసమర్థతను కాంగ్రెస్‌కు ఆపాదించడం సరికాదు'

గజ్వేల్, న్యూస్‌టుడే: భారాస ప్రభుత్వం చేసిన అసమర్థ పాలనను కాంగ్రెస్‌కు ఆపాదించడం సరికాదని గజ్వేల్ ఏఎంసీ ఛైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ సర్దార్‌ఖాన్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ భాస్కర్, కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. ఆదివారం గజ్వేల్‌లో మాట్లాడుతూ.. గజ్వేల్‌లో అసంపూర్తిగా ఉన్న ఎంసీహెచ్‌ను ప్రారంభించి, సౌకర్యాలు కల్పించటం లేదని సీఎం రేవంత్‌రెడ్డిని నిందించడం అన్యాయమన్నారు. ఎన్నికల వేళ హడావుడిగా ఎంసీహెచ్‌ను అప్పటి మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారన్నారు. రింగురోడ్డు పూర్తికాకముందే ప్రారంభించారన్నారు.

చెక్కు అందజేత

చిన్నశంకరంపేట: మండల పరిధి సూరారం గ్రామానికి చెందిన మత్తడికి సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.15వే చెక్కును కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ ఆదివారం బాధిత కుటుంబానికి అందించారు.

ఓ వైపు వృథా.. మరో వైపు వ్యథ!

న్యూస్‌టుడే, టేక్మాల్:

మండల పరిధిలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతుండగా.. మరో వైపు కొన్ని ప్రభుత్వ భవనాలు వృథాగా వదిలేశారు. అద్దె భవనాల్లో కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఇక్కట్లు తప్పడం లేదు. దీంతో ప్రజలు, సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భవనాలు వినియోగంలోకి తీసుకొచ్చి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

అద్దె భవనాలతో ఇబ్బందులు

మండల కేంద్రం టేక్మాల్ తపాలా కార్యాలయం సుమారుగా 30 సంవత్సరాల నుంచి అద్దె భవనంలోనే కొనసాగుతుంది. ఇక్కడ కనీస సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్నారు. ఉపాధి హామీ పథకంలో పని చేసిన కూలీలు డబ్బులు తీసుకునేందుకు వచ్చిన వారితో పాటు ఇతరులకు కనీసం నిలువ నీడ లేదు. కార్యాలయం కోసం పంచాయతీ స్థలాన్ని కేటాయించినా నిధులు మంజూరు కాకపోవడంతో నిర్మాణం చేపట్టలేదు. స్థానిక తపాలా కార్యాలయ పరిధిలో పది తపాలా కార్యాలయాలు అద్దె భవనాలు, పంచాయతీ భవనాల్లో కొనసాగుతున్నాయి. టేక్మాల్ గ్రంథాలయం స్థానిక గాంధీ భవనంలోని రెండు గదుల్లో కొనసాగుతుంది.


వినియోగంలో లేని అతిథి గృహం


అద్దె భవనంలో తపాలా కార్యాలయం

- మండలంలో 73 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా 26 కేంద్రాలకు సొంత భవనాలు లేవు, 27 అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. మిగతావి ఇతర ప్రభుత్వ భవనాల్లో కొనసాగుతున్నాయి.
- మండలంలో పది కొత్త పంచాయతీలు ఏర్పాటు చేయగా వాటిని అద్దె భవనాలు, పాఠశాల భవనాల్లో నిర్వహిస్తున్నారు. వల్లపల్లి, కమ్మరికత్త, ఎక్లాస్‌పూర్ భవనాలకు నిధులు మంజూరు కాలేదు. మిగతా వాటికి నిధులు మంజూరు కాగా సాలోజిపల్లిలో నిర్మాణం పూర్తయినా భవనం వినియోగంలోకి రాలేదు. మల్కాపూర్, పాపాదిలో పంచాయతీ భవనాలు నిర్మాణ దశలో ఉన్నాయి. మిగతా చోట్ల పనులు ప్రారంభం కాలేదు.

నిరుపయోగంగా భవనాలు:

టేక్మాల్‌లో అతిథి గృహం గతంలో శిథిలావస్థకు చేరుకుంది. 2012లో మరమ్మతుల కోసం రూ.8.50 లక్షలు మంజూరు కాగా పనులు పూర్తయినా వినియోగంలోకి రాలేదు. ప్రస్తుతం భవనం వినియోగం లేక శిథిలావస్థకు చేరుకుంటుంది. టేక్మాల్ వ్యవసాయ కార్యాలయం పక్కన గతంలో ఐసిడిఎస్ నమూనా గృహం, టేక్మాల్ ప్రాంతంలో 1999లో రూ.7.50లక్షల వ్యయంతో సామాజిక భవనం నిర్మించారు. ప్రహరీ నిర్మాణానికి రూ.2 లక్షలు మంజూరు చేయగా పూర్తి చేశారు. ఇప్పటి వరకు వినియోగంలోకి రాలేదు. టేక్మాల్‌లో ప్రాథమిక పాఠశాల పాత భవనం సైతం నిరుపయోగంగా ఉంది. వీటి మరమ్మతులకు నిధులు కేటాయించి భవనాలను వినియోగంలోకి తేవడమో ఇతర అవసరాలకు కేటాయిస్తే సౌకర్యంగా ఉంటుంది.


తూప్రాన్ ప్రధాన రహదారిపై ప్రతాపరెడ్డి, నాయకులు


రామాయంపేటలో తిరుపతిరెడ్డి ..


టేక్మాల్ రాస్తారోకో

రైతులపై ప్రభుత్వానిది కపట ప్రేమ: భారాస


చేగుంటలో నాయకులు, కార్యకర్తల ఆందోళన


రేగోడ్ గాంధీ చౌక్ వద్ద భారాస నాయకుల నిరసన


చిన్నశంకరంపేటలో ఆందోళన చేస్తూ..

తూప్రాన్, రామాయంపేట, చేగుంట, చిన్నశంకరంపేట, చిలప్‌చెడ్, రేగోడ్, అల్లాదుర్గం, టేక్మాల్, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని భారాస గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వంటేరు ప్రతాపరెడ్డి విమర్శించారు. పార్టీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు రైతు భరోసా అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ తూప్రాన్ ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళన చేశారు. నాయకులు సత్యనారాయణ గౌడ్, కృష్ణారెడ్డి, ఆంజనేయులు గౌడ్, సతీష్‌చారి పాల్గొన్నారు. రామాయంపేటలో భారాస మెదక్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, పట్టణాధ్యక్షుడు నాగరాజు, జితేందర్ గౌడ్, యాదగిరి, చంద్రం ప్రభుత్వ దిష్టి దగ్ధం చేసి ర్యాలీ నిర్వహించారు. చేగుంట, నార్సింగిలో ధర్నా చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు నారాయణరెడ్డి, కుమ్మరి బాబు, ముదాం శ్రీనివాస్, చిందం సబిత ఉన్నారు. చిన్నశంకరంపేటలో పార్టీ మండల అధ్యక్షుడు రాజు నాయకులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. చిలప్‌చెడ్‌లో జోగిపేట-నర్సాపూర్ ప్రధాన రహదారిపై భారాస నాయకులు ఆందోళన చేశారు. రేగోడ్‌లో మండల ప్రధాన కార్యదర్శి రమేష్, నాయకులు రవీందర్, నర్సింహులు, రాములు పాల్గొన్నారు. టేక్మాల్‌లో మెదక్-బొడ్మట్‌పల్లి రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. నాయకులు వీరప్ప, సిద్దయ్య, రవి, నారాయణ, అల్లాదుర్గంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు సాయికుమార్, నవీన్‌రెడ్డి, బేతయ్య తదితరులు పాల్గొని నిరసన తెలిపారు.

మురుగుతో అవస్థలు.. కాల్వలు నిర్మిస్తే మేలు



చిన్నశంకరంపేటలో మెదక్-చేగుంట ప్రధాన రహదారిపై ఐబీ బంగ్లా నుంచి సూరారం రోడ్డు వరకు మురుగునీరు రోడ్డుపై పారుతోంది. దీంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారి వెంట ఇళ్లు నిర్మించుకున్న వారు విధిగా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి. మురుగుతో దోమల వ్యాప్తి అధికంగా ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ఇలా మురుగు నీరు పారడంతో రోడ్డు శిథిలమైపోతుందని ఇంజినీర్లు చెబుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. – న్యూస్‌టుడే, చిన్నశంకరంపేట

అధ్వానంగా వంతెన.. రాకపోకలకు ఇక్కట్లు



హవేలిఘనపూర్ మండలం వాడి పంచాయతీ పరిధిలోని దూప్‌సింగ్ తండాకు వెళ్లే మార్గంలో వంతెన భారీ వరదలు రావడంతో పూర్తిగా ధ్వంసమైంది. దీంతో రాకపోకలు సాగించేందుకు తండా వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ దారి గుండా నిత్యం పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ప్రజలు పలు అవసరాల నిమిత్తం రాకపోకలు సాగిస్తారు. ఏదైనా ప్రమాదం జరగక ముందే అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామస్థులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అసంపూర్తిగా ఉన్న వంతెన నిర్మాణం పూర్తి చేసి ఇబ్బందులు తీర్చాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, హవేలిఘనపూర్

న్యూస్‌టుడే, హవేలిఘనపూర్, వెల్దుర్తి: ? చౌట్లపల్లి పంచాయతీ పరిధి శుక్లాల్‌పేటకు హవేలిఘనపూర్ నుంచి చౌట్లపల్లి ప్రధాన రహదారి నుంచి మట్టిదారి ఉంది. తారురోడ్డుగా మార్చాలి. – ప్రవీణ్, శుక్లాల్‌పేట

✓ రోడ్డు నిర్మాణం గురించి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. నిధులు రాగానే నిర్మించేలా చర్యలు తీసుకుంటాం.

– గురవయ్య, పంచాయతీ కార్యదర్శి, చౌట్లపల్లి

? వెల్దుర్తి మండలం బస్వాపూర్‌లో పంచాయతీ కార్యాలయానికి సొంత భవనం లేక సామాజిక భవనంలో నిర్వహిస్తున్నారు.

– విఠల్, బస్వాపూర్

✓ పంచాయతీ భవన నిర్మాణం కోరుతూ నిధుల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తాం. రాగానే భవన నిర్మాణం చేపడతాం.

– ఉమాదేవి, ఎంపీడీవో, వెల్దుర్తి

గ్రామాలకు శిక్షణ ఐఏఎస్‌లు

నర్సాపూర్ రూరల్, మనోహరాబాద్, తూప్రాన్, న్యూస్‌టుడే: నర్సాపూర్ మండలం అవంచ గ్రామానికి సోమవారం శిక్షణ ఐఏఎస్‌లు వస్తున్నట్లు ఎంపీడీవో మధులత తెలిపారు. ఇందు కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. కూచారం గ్రామానికి 5మంది శిక్షణ ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల బృందం రానున్నట్లు ఎంపీడీవో వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 21 నుంచి 23 వరకు ఉంటారన్నారు. తూప్రాన్ మండలం మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో సోమవారం నుంచి మూడు రోజులు శిక్షణ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు పర్యటించనున్నట్లు ఎంపీడీవో శేషాద్రి తెలిపారు.

క్రీడల్లో రాణిస్తే బంగారు భవిత


విజేతలకు ట్రోఫీ అందిస్తున్న రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్

శివ్వంపేట: గ్రామీణ క్రీడాకారులు ఆటల్లో రాణిస్తే బంగారు భవిష్యత్తు ఉంటుందని నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి ఆవుల రాజిరెడ్డి, జిల్లా డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి అన్నారు. మండలంలోని దొంతిలో భవనగారి శ్రీనివాస్ నిర్వహించిన క్రికెట్ పోటీల్లో వివిధ మండలాలకు చెందిన 15 గ్రామాల క్రికెట్ క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీల్లో మొదటి బహుమతి సాధించిన తూప్రాన్ జట్టుకు రూ.17,500, ద్వితీయ బహుమతి పొందిన శభాష్‌పల్లి జట్టుకు రూ.10వేలు అందజేశారు. సీనియర్ నాయకులు లక్ష్మీకాంతరావు, పీఏసీఎస్ ఛైర్మన్ వెంకటరామ్ రెడ్డి, నిర్వాహకులు మురళి, చాకలి రాజు ఉన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు విద్యార్థిని ఎంపిక

చేగుంట, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి స్కూల్‌గేమ్స్ ఖోఖో పోటీలకు చేగుంట మండలం చందాయిపేట జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థిని దీప్తి ఎంపికైనట్లు పీడీ శంకర్ తెలిపారు. మెదక్‌లో జరిగిన అండర్-14 ఖోఖో పోటీలో ప్రతిభ చూపించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించనున్నట్లు తెలిపారు.


దీప్తి

క్రీడా కిట్లు అందజేత

నర్సాపూర్, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో స్థానిక క్రీడాకారులకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గాలి అనిల్‌కుమార్ పంపిన క్రీడా సామగ్రిని అతని అనుచరులు నర్సింగ్‌రావు తదితరులు క్రీడాకారులకు ఆదివారం అందజేశారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ



సాఫ్ట్‌బాల్ పోటీల్లో మెదక్ జిల్లా జట్టు

మనోహరాబాద్, న్యూస్‌టుడే: వరంగల్‌లో జరిగిన 9వ తెలంగాణ సబ్ జూనియర్ అంతర్ జిల్లా సాఫ్ట్‌బాల్ పోటీల్లో మెదక్ జట్టు కాంస్య పతకం సాధించింది. జట్టులో మనోహరాబాద్‌కు చెందిన ర్యాకల శ్రీకృతిగౌడ్, టేక్మాల్ గీతికారెడ్డి, సాయిసిరి, మోక్షిత, శాన్వి, ప్రణవి, తేజశ్రీ ప్రాతినిధ్యం వహించి జట్టు విజయంలో చక్కటి ప్రతిభ కనబరిచారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

చేగుంట, వెల్దుర్తి, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. చేగుంట ఎస్సై చైతన్యరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..మాసాయిపేట గ్రామానికి చెందిన తలారి బాబు (40) వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈ నెల 16న 44వ జాతీయ రహదారిపై బస్టాండ్ వద్ద రోడ్డు దాటుతున్నాడు. నిజామాబాద్ వైపు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న బైక్ వేగంగా ఢీకొట్టడడంతో బాబు తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే 108 అంబులెన్స్‌లో హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడి అన్న మధు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

గుర్తుతెలియని వ్యక్తి..ఆస్పత్రికి తరలింపు

పాపన్నపేట, న్యూస్‌టుడే: ఏడుపాయల వనదుర్గామాత ఆలయం వద్ద హరిత హోటల్ సమీపంలో సుమారు 60-65ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తి అచేతన స్థితిలో పడి ఉన్నాడు. ఆదివారం అటుగా వెళ్లిన స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకొని 108లో మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అతని సంబంధీకులు ఎవరైనా ఉంటే పాపన్నపేట ఠాణాలో సంప్రదించాలని ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

ప్రమాదవశాత్తు రేకుల ఇల్లు దగ్ధం

పాపన్నపేట, న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్‌తో ఓ రేకుల ఇల్లు దగ్ధమైన ఘటన మండల పరిధి యూసుఫ్‌పేటలో జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన కోదండం సాయిలు స్థానిక బుడగ జంగం కాలనీలో రేకుల ఇంట్లో నివాసం ఉంటున్నాడు. ఆదివారం ఓ పని నిమిత్తం ఇంటి నుంచి బయటకు వెళ్లారు. ఈ క్రమంలో షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో మంటలు చెలరేగి, పొగ వ్యాపించడంతో స్థానికులు ఆర్పే ప్రయత్నం చేశారు. ఫైర్ సిబ్బందికి తెలపగా వారు వచ్చి మంటలు ఆర్పేశారు. అప్పటికే బీరువాలో బంగారం, వెండి వస్తువులు, నగదు, నిత్యావసర సరుకులు కాలిపోయాయి. సుమారు రూ.4లక్షల ఆస్తి నష్టం జరిగిందని ఆదుకోవాలని బాధితుడు వాపోయాడు.

నర్సాపూర్‌లో దొంగల హల్‌చల్

నర్సాపూర్, న్యూస్‌టుడే: పట్టణంలోని పలు వార్డుల్లో శనివారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. నర్సాపూర్ ఆర్టీసీ బస్టాండ్‌కు ఎదురుగా ఉన్న 10వ వార్డులో ముక్కాల శ్రీనివాస్ ఇంటి తాళాలు పగలగొట్టి లోపలికి వెళ్లేందుకు విఫలయత్నం చేశారు. 13వ వార్డులో రఫిక్‌కు చెందిన ద్విచక్ర వాహనాన్ని ఇంటి ముందు నిలిపి ఉంచగా గుర్తుతెలియని వ్యక్తి అపహరించారు. ఈ రెండు చోరీ ఘటనలు సీసీ కెమెరాల్లో నిక్షిప్తమైయ్యాయి. ఆదివారం బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మూఢనమ్మకాల పేరిట దాడిచేస్తే చర్యలు

తూప్రాన్, న్యూస్‌టుడే: మూఢ నమ్మకాల పేరిట ఇతరులపై దాడి చేస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని తూప్రాన్ ఎస్సై శివానందం హెచ్చరించారు. మండలంలోని కిష్టాపూర్‌లో మంత్రాల నెపంతో ఓ కుటుంబంపై పలువురు దాడి చేయడంతో ఆదివారం గ్రామంలో ఆయన పర్యటించి ప్రజలకు మూఢనమ్మకాలపై అవగాహన కల్పించారు. ప్రస్తుత సాంకేతిక యుగంలో మూఢ నమ్మకాల పేరిట దాడులకు పాల్పడం చట్ట వ్యతిరేకం అన్నారు. మరోసారి ఇలాంటి సంఘటనలు జరిగితే సహించేది లేదన్నారు. ఆయా పార్టీల నాయకులు, ప్రజాసంఘాలు పాల్గొన్నారు.


గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై శివానందం

ఆలయాలపై దాడులను సహించం

పాపన్నపేట: హిందూ ఆలయాలపై దాడులు చేస్తే సహించేది లేదని భజరంగ్‌దళ్ మండలాధ్యక్షుడు బోల కృష్ణ అన్నారు. ఆదివారం పాపన్నపేటలో ఆయన మాట్లాడుతూ. .సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయం వద్ద శాంతియుతంగా నిరసన చేపట్టిన హిందువులపై ప్రభుత్వం లాఠీ ఛార్జ్ చేయడం హేయమైన చర్య అన్నారు. దాడులు చేసిన వారిని బహిరంగంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వెంకట్, ప్రవీణ్, గోపాల్ తదితరులున్నారు.

క్షేత్రస్థాయి పర్యటనలతో విద్యార్థులకు అవగాహన



సీసీఎంబీ వద్ద అధ్యాపకులు, విద్యార్థులు

నర్సాపూర్ రూరల్, న్యూస్‌టుడే: విద్యార్థులకు చదువుతో పాటుగా మరింత విషయ పరిజ్ఞానం పెరగాలంటే క్షేత్రస్థాయి పర్యటనలతోనే సాధ్యమని పెద్దచింతకుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల జంతు శాస్త్రం అధ్యాపకుడు డాక్టర్ సురేష్‌కుమార్ అన్నారు. ఇందులో భాగంగా 90మంది విద్యార్థులను ఇటీవల హైదరాబాద్‌లో పలు కేంద్ర ప్రభుత్వ రంగ కార్యాలయాలను సందర్శించారు. సీఎస్ఐఆర్, ఎన్‌జీఆర్ఐలో భూమిలో శిలలు ఏవిధంగా ఏర్పడతాయి. వాటిలో ఖనిజ లవణాలను గుర్తించి వాటి వయస్సు నిర్ధారణపై శాస్త్రవేత్తలను అడిగి తెలుసుకున్నారు. సూర్య, చంద్ర గ్రహణం, అగ్నిపర్వతాలు వంటి అంశాలపై విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. సైబర్ మోసాల బారినపడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు సైతం తెలుసుకున్నారు.

సీసీఎంబీ అద్భుతం: సీసీఎంబీలో జరుగుతున్న ప్రయోగాలు అద్భుతంగా ఉన్నాయని విద్యార్థులు తెలిపారు. జీవులపై జరుగుతున్న జన్యు పరిశోధనల గురించి అడిగి తెలుసుకున్నారు. పుస్తకాల్లో చదివిన దానికంటే ప్రత్యక్షంగా వెళ్లి చూస్తే పూర్తిగా అవగతం అవుతుందన్నారు. ప్రభుత్వ కళాశాల అయినప్పటికీ ఇలా క్షేత్రస్థాయి పర్యటనలకు తీసుకెళ్లడంతో ప్రైవేటు కళాశాలలకు దీటుగా నాణ్యమైన విద్యను ప్రభుత్వం అందిస్తుందని విద్యార్థులు తెలిపారు.


అందరికి అవకాశం: కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు క్షేత్రస్థాయి పర్యటనకు తీసుకెళ్లేందుకు ప్రిన్సిపల్ డాక్టర్ దామోదర్ ప్రత్యేక ప్రణాళిక తయారు చేస్తున్నట్లు విద్యార్థులు తెలిపారు. వీటితో పాటు పలు రకాలుగా అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ పర్యటనలో ఎంతో నేర్చుకున్నట్లు వారు తెలిపారు. పర్యటనలో అధ్యాపకులు సౌజన్య, రుక్మిణి, రమేష్, ఆరీఫ్ తదితరులున్నారు.

రోడ్డు మధ్య స్తంభాలు.. రాకపోకలకు ఇబ్బందులు



నర్సాపూర్ పట్టణంలోని 14వ వార్డులో సిమెంటు రోడ్డు నిర్మించారు. కానీ దారి మధ్యలో ఉన్న విద్యుత్తు స్తంభాలను తొలగించలేదు. ఇనుప, సిమెంటు స్తంభాలతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాటికి ఉన్న తీగలు సైతం అస్తవ్యస్తంగా ఉన్నాయి. తీగల్ని సరిచేసి, రోడ్డు మధ్యలో ఉన్న స్తంభాలను వేరొక చోటికి తరలించాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నర్సాపూర్

నేలచూపు చూస్తున్న నిఘా నేత్రం



ఒక సీసీ కెమెరా ఉంటే వెయ్యి మంది పోలీసులతో సమానం అంటారు. అవి సక్రమంగా పని చేస్తే నేరాలు జరిగినా ఇట్టే పరిష్కరించే అవకాశం ఉంటుంది. రూ.వేలు వెచ్చించి పోలీసులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కాని చాలా చోట్ల అవి పనిచేయకుండా నేలచూపులు చూస్తున్నాయి. చేగుంట నుంచి గజ్వేల్‌కు వెళ్లే మార్గంలో 44వ జాతీయ రహదారి వంతెన పక్కన సీసీ కెమెరాలు చాలా రోజులుగా పనిచేయడంలేదు. ఇప్పటి వరకు వాటిని పట్టించుకునే వారే కరవయ్యారు. ఈ మార్గంలో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. నేరాలు చేసినవారు ఇటువైపు నుంచి పారిపోయే అవకాశం ఉంది. ఇలాంటి చోట ఏర్పాటు చేసిన కెమెరాలు పనిచేయకపోవడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. – న్యూస్‌టుడే, చేగుంట

జూద స్థావరంపై పోలీసుల దాడి

గజ్వేల్ గ్రామీణ, న్యూస్‌టుడే: జూద స్థావరంపై సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దాడులు నిర్వహించి నిందితులను అదుపులో తీసుకొని కేసు నమోదు చేసినట్లు గజ్వేల్ సీఐ సైదా తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని బయ్యారం శివారులోని ఓ మేకల షెడ్డులో కొంత మంది జూదం ఆడుతున్నారనే సమాచారం మేరకు సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, గజ్వేల్ పోలీసులు దాడులు నిర్వహించారన్నారు. ఈ దాడుల్లో జూదమాడుతున్న ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.34వేల నగదు, రెండు కార్లు, రెండు ద్విచక్ర వాహనాలు, 6 చరవాణులు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

హుస్నాబాద్: హుస్నాబాద్‌లో దాబాలు, బెల్టు షాపులపై దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ తోట మహేశ్ తెలిపారు. మద్యం సిట్టింగులు నిర్వహిస్తున్న రెండు దాబాలు, బెల్టుషాపు నిర్వహిస్తున్న ఒకరిపై కేసు నమోదు చేశామన్నారు.